అరాచక బాట



కనిపిస్తున్న మూడు గుడిసెల వెనక పేట కాల్వపై వంతెన కోసం తొలగించనున్న ఇళ్ల వద్ద బాధిత కుటుంబాలు



పేట కాల్వపై అనధికార వంతెన కోసం నరికివేసిన చెట్లు

- గేటెడ్ కమ్యూనిటీకి మార్గం కోసం అకృత్యం
- మూడు గుడిసెలు ఖాళీ చేయాలని తిమ్మాపురం జనసేన నేతల హుకుం
- అనధికార వంతెన కోసం చెట్ల నరికివేత
- బెంబేలెత్తిపోతున్న పేదలు

కాకినాడ రూరల్: అక్కడ పెద్దోళ్ల కోసం గేటెట్ కమ్యూటీ, అపార్టుమెంట్లు నిర్మించారు. మార్గం మాత్రం సక్రమంగా లేదు.. దీనికి ఒకటే పరిష్కారం కాల్వపై అనధికారికంగా వంతెన నిర్మించాలి. ఇందుకు అడ్డుగా ఉన్న గుడిసెలను తొలగించాలి. ఇంకేమీ ఉంది. పేదలకు న్యాయం చేయడానికి ముందుకు రాని నాయకులు బడాబాబుల కోసం ఏకమైపోయారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెచ్చిపోయారు. అనుకున్నదే తడువుగా చెట్లను నరికించారు. గుడిసెలు ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు. వివరాలలోకి వెళితే.. మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మారుతీనగర్ అభివృద్ధి చెందిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఏపీఎస్పీ బెటాలియన్‌కు ఎదురుగా పేట కాల్వకు అవతల ఉన్న మారుతీనగర్‌లో గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్లు ఉన్నాయి. అక్కడికి వెళ్లేవారికి సరైన మార్గం లేదు. పేట కాల్వపై వంతెన నిర్మిస్తే ఏపీఎస్పీ ఫంక్షన్ హాలు వద్ద పిఠాపురం రోడ్డుపైకి నేరుగా చేరుకోవచ్చు. ఇందుకు కాల్వపై వంతెన నిర్మాణ పనులకు జనసేన తిమ్మాపురం నాయకులు ముందుకు వచ్చారు. గృహ నిర్మాణదారుడికి వీరికి మధ్య ఏ ఒప్పందం కురిందో గానీ పేదలపై ప్రతాపం చూపేందుకు సోమవారం మూడు గుడిసెలతో పాటు కాల్వకు రమణయ్యపేట వైపు గట్టుపై చెట్లను నరికివేశారు. వంతెన నిర్మిస్తున్నామని, గుడిసెలు ఖాళీ చేసి పోవాలని అనధికారిక ఆదేశాలు ఇచ్చేశారు. వాటిలో దాదాపు రెండున్నర దశాబ్దాలు పాటు నివాసం ఉంటున్న మూడు కుటుంబాలకు చెందిన కోట అరుణ, గేదెల గౌరమ్మ, చేబ్రోలు వరలక్ష్మి కుటుంబాలు నేడు భయాందోళనకు గురవుతున్నారు. కాల్వపై ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా వంతెన నిర్మించడానికి యత్నిస్తున్న వారు, వారికి వత్తాసు పలుకుతున్న జనసేన నాయకులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుడిసెలు తొలగిస్తామని హెచ్చరించారు



తమ గుడిసెలు తొలగిస్తామని జనసేన నాయకులు హెచ్చరించారు. ఎప్పటి నుంచో ఇక్కడ గుడిసెలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నాం. తిమ్మాపురం జనసేన నాయకుడు తాతాజీ, అనుచరులు వచ్చిన తమను ఖాళీ చేయాలని కోరారు. ఇదేమీ అన్యాయం.

– గేదెల వరలక్ష్మి, మారుతినగర్,

చెట్లు నరికేశారు



తమ గుడిసెల వద్ద పెంచుకున్న చెట్లను నరికేశారు. ఖాళీ చేసి పొమ్మంటున్నారు. పెద్ద వారి ఇళ్ల కోసం కాల్వ వంతెన నిర్మిస్తారంటా. పక్కనే దగ్గరలోనే తూరలతో వంతెన ఉన్నా తమ గుడిసెలే అడ్డం అన్నట్టు జనసేన నాయకులు మాట్లాడడం బాధించాయి.

– కోట అరుణ, మారుతినగర్

సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ కాకినాడ నగరపాలక కమిషనర్ భావన మంగళవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా నగరంలోని గాంధీనగర్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని లేకుంటే చర్యలు తప్పవని కమిషనర్ భావన హెచ్చరించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

బాలల పరిరక్షణకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ విజయకుమారి

- ఐసీడీఎస్ పీడీ విజయకుమారి
- వివిధ శాఖల సిబ్బందికి శిక్షణ

సామర్లకోట: బాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి కె.విజయకుమారి అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో కిశోర వికాసంపై మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్, విద్య, సచివాలయ కార్యదర్శులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన వారు కిశోర వికాసం ద్వారా వార్డు స్థాయిలో గ్రూపులు ఏర్పాటు చేసి బాలల చట్టాలు, పరిరక్షణ అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగించాల్సి ఉన్నదన్నారు. ఇదే సమయంలో బాల్య వివాహాలపై అవగాహన పెంచాల్సిన బాధ్యత ఉన్నదని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ ప్రభుత్వం బాలికలకు కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. బాలికలు చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఈ మేరకు తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలని సూచించారు. సీడీపీఓ జి.ఉష మాట్లాడుతూ నేటి సమాజంలో మార్పు కోసమే ప్రతి ప్రాంతంలోను ప్రజలకు అందుబాటులో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బాలలపై వేధింపులు ఎక్కువ అవుతున్నారని, బాలలను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యుక్త వయసులో రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, జీవనోపాధిపై గ్రామ స్థాయిలో బాల బాలికలకు అవగాహన కలిగిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు 11 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన బాలికలను రెండు గ్రూపులుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సీహెచ్ వెంకట్రావు, అనేక అంశాలను వివరించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, హెల్త్‌లైన్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహమ్మద్ సుల్తాన్ బీబీ, మంగ, నిర్మలాకుమారి, జి.వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెసా, అటవీ చట్టాలపై అవగాహన అవసరం



పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: గిరిజనుల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో ప్రత్యేకంగా పొందుపర్చిన పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డు ఏరియాస్ (పెసా), అటవీ హక్కుల చట్టంపై అవగాహన పెరగాలని విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని 38 మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు రెండో బ్యాచ్‌లో నిర్వహించే శిక్షణను ఆయన మంగళవారం ఈటీసీలో ప్రారంభించారు.ఫిబ్రవరి 15 నుంచి శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని అధికారులకు, గిరిజనులకు వారి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షంతో సమీక్షించాలి

బోట్‌క్లబ్: మూడేళ్లుగా కాకినాడ కార్పొరేషన్‌కు పాలకవర్గం లేనందున అఖిలపక్షంతో 2025–26 సంవత్సరంపై సమీక్ష నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడేళ్లుగా కార్పొరేషన్‌కు పాలక వర్గం లేదని, అప్పటి నుంచి ఆరుగురు కమిషనర్లు, నలుగురు ప్రత్యేకాధికారులు మారినప్పటికీ పౌర సౌకర్యాలు ప్రగతి కోసం ప్రజల అభిప్రాయాల స్వీకరించే సమీక్ష సమావేశం చేపట్టలేదన్నారు.

సాంకేతికతను అనుసరించి ఆవిష్కరణలు

మైక్రో బయాలజీ విద్యార్థులకు అభినందనలు

కాకినాడ రూరల్: చదువులో ప్రతిభ కనబర్చడం, టెక్నాలజీతో అనుసంధానం చేస్తూ కొత్త ఆవిష్కరణలు చేసి దేశానికి ఉపయోగ పడే పేటెంట్లను సాధించాలని ఎం ఎస్సీ మైక్రో బయోలజీ విద్యార్థినులను అధ్యాపకులు కోరారు. రాజీవ్‌గాంధీ పీజీ కళాశాలలో మెక్రో బయాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎంఎస్సీ మెక్రో బయాలజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అనూష, నవ్య దీపికలను అధ్యాపకులు నరసింహ, బలరాం, ప్రీతి చంద్రకళ అభినందించారు. విద్యార్థులను సన్మానించి రేపటి సమాజానికి ఉపయోగపడేలా చదువును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్యకారులకు అవగాహన

కాకినాడ క్రైం: వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కోస్ట్‌గార్డు కాకినాడ స్టేషన్ ఆధ్వర్యంలో కుంబాభిషేకం దేవాలయ ఆవరణలో మత్స్యకారులకు మంగళవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యకారులు వేట సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తీరం హద్దులు, భద్రతలో అనుసరించవలసిన పాత్రపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశాఖపట్టణం నుంచి చెన్నైకి ద్విచక్రవాహనాలపై ర్యాలీగా బయల్దేరిన ఈస్ట్రన్ కోస్ట్‌గార్డుకు చెందిన 34 మంది సిబ్బంది ప్రత్యేక అతిథులుగా హాజరై మత్స్యకారులతో మమేకమయ్యారు.

అన్న క్యాంటీన్ల పని తీరుపై సమీక్ష

కాకినాడ సిటీ: నగరంలోని అన్న క్యాంటీన్ల పనితీరుపై కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ మంగళవారం సమీక్షించారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ ఎలా జరుగుతున్నదీ ఆరా తీశారు. సమయానికి భోజనం, అల్పాహారం అందిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. భోజనం చేయడానికి వచ్చే వారి కోసం కల్పించాల్సిన సౌకర్యాలపై పలు సూచనలు ఇచ్చారు.

నెయిల్ పాలిష్ తాగిన చిన్నారి

కాకినాడ క్రైం: కాకినాడ గ్రామీణం మండలం తూరంగి గ్రామానికి చెందిన మూడేళ్ల కొప్పాడి పాప ఇంట్లో ఆడుకుంటూ నెయిల్ పాలిష్ తాగి అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు చిన్నారిని మంగళవారం కాకినాడ జీజీహెచ్‌లో చేర్పారు. బాలికకు వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కాకినాడ క్రైం: వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన జి.మణికంఠ (20) ఈ నెల 26న పురుగుల మందు తాగి కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

నేడు పురులియా చౌ నృత్య రూపకం

పిఠాపురం: పశ్చిమ బెంగాల్‌లో ప్రసిద్ధి చెందిన పురులియా చౌ నృత్య రూపకాన్ని బుధవారం పిఠాపురంలో ప్రదర్శించనున్నట్లు సంగమేశ్వర సంగీత సమాఖ్య సభ్యులు తెలిపారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో ఈ నృత్య రూపకం ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు. 98 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చి పేరొందిన ఈ నృత్య రూపకాన్ని వీక్షించాలని వారు కోరారు.

క్లుప్తంగా

ఆరోగ్యానికి కొవ్వు కూడా అవసరమే

కాకినాడ రూరల్: ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవించడానికి కొద్దిపాటి కొవ్వు కూడా అవసరమని డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ శరీరానికి శక్తిని అందించడానికి, నరాల వ్యవస్థ సజావుగా సాగడానికి ఎప్పటికప్పుడు కండరాల సంకోచ, వ్యాకోచాలు, శరీర ఉష్ణోగ్రత క్రమబద్ధీకరణకు కొవ్వు పదార్థాలు అవసమన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు, సత్యనారాయణరాజు, ప్రసాద్‌నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా పాల్గొన్నారు.

లాలా లజపతిరాయ్ జయంతి

కాకినాడ రూరల్: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ జయంతిని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మంగళవారం నిర్వహించారు. వీహెచ్‌పీ నగరశాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ, రెడ్నం రాజా, అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ



గోదామును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎస్‌ఓ ప్రసన్న లక్ష్మి

పిఠాపురం: గొల్లప్రోలు మార్కెట్ యార్డు వద్ద ఉన్న పౌర సరఫరాల శాఖ గోదామును మంగళవారం ఇన్‌చార్జి డీఎస్‌ఓ ప్రసన్న లక్ష్మి తనిఖీ చేశారు. ఆమె అధికారులతో కలిసి గోదాములో ఉండాల్సిన నిల్వ వివరాలు పరిశీలించారు. రికార్డులను పరిశీలించిన ఆమె ఎటువంటి తేడాలు లేకుండా నిత్యావసర సరుకులు సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దారు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల మద్దతు కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి



న్యాయవాదులతో శెట్టిబత్తుల రాజబాబు

బోట్‌క్లబ్: త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు మద్దతు తెలపాలని శెట్టిబత్తుల రాజబాబు మంగళవారం పలువురు న్యాయవాదులను కోరారు. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, హైకోర్టు బార్ సభ్యులు నరహరిశెట్టి రవికృష్ణలను కలిసి తనకు మద్దతు తెలిపాలని కోరారు. దీనికి వారు స్పందించి రాజబాబు బార్ అసోసియేషన్ సభ్యుడని, తమ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చెక్కా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మంటల నిరోధంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదాలు, విపత్తులు, ఎమర్జన్సీపై ఏపీఎస్పీ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాఠశాలలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపిస్తే ఏ విధంగా నిర్మూలించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ రిజర్వ్ ఎస్సై రాము, సాలిపేట అగ్నిమాపక అధికారి వి.సుబ్బారావు, డీపీఎం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కుమారి, హెచ్‌ఎం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన యూనియన్ బ్యాంక్ మహిళా ఉద్యోగికి ఏడాది జైలు, రెండు లక్షల రూపాయలు పరిహారం విధిస్తూ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రసన్నలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారు తరపు న్యాయవాది వసుధ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన పడాల శ్రీనివాసరెడ్డి వద్ద నుంచి రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న పోలోజు సత్యవాణి 2018లో రూ.ఐదు లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ అప్పు తీర్చడానికి 2021లో చెక్కు ఇచ్చారు. చెక్కు బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయ్యింది. దీనితో కోర్టులో దావా వేశారు. కోర్టు విచారణలో మహిళా బ్యాంక్ ఉద్యోగిపై నేరం రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీరు చెప్పారు.

ఉడకని వంటకాలతో వేడుక ఎలా?

- కుమారుడి జన్మదిన వేడుకలకు ఆర్డర్ ఇచ్చిన మెనూపై ఓ కుటుంబం ఆందోళన
- హోటల్ వద్ద ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో పరిస్థితి ప్రశాంతం



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని హోటల్ వద్ద ఉన్న బాధితులకు సంచుల్లో ఇచ్చిన ఆహారం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని ఒక హోటల్ వద్ద మంగళవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. తమ బిడ్డ పుట్టిన రోజు వేడుకలు సోమవారం సాయంత్రం సదరు హోటల్‌లో నిర్వహించేందుకు కాకినాడకు చెందిన ఒక కుటుంబం ఏపీఐఐసీ కాలనీలో సెవెన్ స్కా హోటల్‌తో ఒప్పందం కుదుర్చుకుని మెనూ ప్రకారం సొమ్ములు చెల్లించారు. కాగా మెనూ ప్రకారం ఫుడ్ ఇవ్వలేదని, మటన్ ఉడక లేదని, కల్తీ జరిగిందని అనుమానం వ్యక్తం చేసి నిరసన తెలియజేశారు. హోటల్ నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మంగళవారం ఉదయమే సదరు కుటుంబం, బంధువులతో కలిసి వచ్చిన ఆందోళన చేసింది. విషయం తెలుసుకున్న సర్పవరం పోలీసులు ఆ కుటుంబానికి నచ్చజెప్పి, వారు ఆర్డరిచ్చిన ఫుడ్‌ను తమతో తీసుకువెళ్లారు.

దీనిపై ఏఎస్సై నాగేశ్వరరావును వివరణ కోరగా ఆందోళన సమాచారంతో తాము వెళ్ళామని, ఆహార పదార్థాల నాణ్యత, కల్తీ తదితర అంశాలు తమ పరిధిలోకి రావన్నారు. హోటల్ నుంచి తీసుకువచ్చిన ఫుడ్‌ను ఫుడ్ ఇనస్పెక్టర్ కార్యాలయానికి పంపామన్నారు.

ఈ విషయమై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా సెవెన్ స్కా హోటల్‌లో ఆహార కల్తీ జరిగింటే రాత్రి తినేటప్పుడే తమ దృష్టికి తీసుకురావాలి. ఆ విధంగా తమకు ఫిర్యాదు రాలేదన్నారు. ఉదయం సంచుల్లో ఆహారం ఉందన్నారు. సదరు హోటల్ సెంట్రల్ లైసెన్స్ కలిగి ఉందని, ఎమర్జెన్సీ సమయంలోనే తాము తనిఖీకి వెళ్లాల్సి ఉంటుందన్నారు.

ఔరా.. నృత్యాలు అనుపమానం



మహిషాసుర మర్దిని ఘట్టంలోని సన్నివేశం

- పురులియా సంప్రదాయంలో మహిషాసుర మర్దిని, అభిమన్యు వధ రూపకాలు

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి గానసభల్లో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక జేఎన్‌టీయూకే అల్యూమినియం ఆడిటోరియంలో నిర్వహించిన పశ్చిమ బెంగాల్ వారి పురులియా చౌ సాంప్రదాయ జానపద నృత్య ప్రదర్శన నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. మహిషాసుర మర్దిని, అభిమన్యు వధ ఘట్టాలకు చక్కటి నృత్యం చేసి ప్రేక్షకులను మైమరపించారు. మహిషాసుర మర్దిని ఘట్టంలో దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసుడిని వధించి, మంచి, చెడులను జయించడం ఈ నృత్య రూపకంలో కళ్లకు కట్టినట్లు చూపారు. అభిమన్యు వధ ఘట్టంలో భారత యుద్ధంలో గొప్ప వీరుడైన అభిన్యుడు చక్రవ్యూహంలోకి వెళ్లడం మాత్రమే తల్లి కడుపులో ఉన్నప్పుడు తెలుసుకుని, దాని నుంచి బయటకు తప్పించుకుని బయటకు వచ్చే మార్గం తెలియక కౌరవ సైన్యంతో పోరాడిన ఘట్టాలు అద్భుతంగా ప్రదర్శించారు.

పట్టుతప్పితే ప్రమాదం చిన్నా..!



ఫుట్‌పాత్‌పై వేలాడుతూ వెళ్తున్న విద్యార్థులు

సామర్లకోట: బస్సులలో విద్యార్థులు నిత్యం వేలాడుతూ ప్రయాణిస్తూనే ఉన్నారు. బస్సుల ఫుట్‌బోర్డులపై వేలాడుతూ వెళ్తున్నవారి చేతులు పట్టు తప్పితే పరిస్థితి ఏమిటన్నది వారికి అర్థం కావడం లేదు. అటు రవాణా శాఖ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ ఇటువంటి పరిస్థితిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని తోటి ప్రయాణికులు, స్థానికులు అంటున్నారు. బస్సు గోతులలో పడిన సమయంలో అదుపు తప్పి కింద పడి పాయే ప్రమాదం ఉంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో రహదారులు రద్దీగా ఉంటాయి. దాంతో కింద పడితే వెనుక నుంచి వచ్చే వాహనాల వారు కిందపడిన వారిని గమనించక పోతే ప్రమాదం ఏ స్థాయిలో ఉంటుందో విద్యార్థులు గమనించాలి. కాకినాడ-పెద్దిపాలెం బస్సుకు అనేక మంది విద్యార్థులు ప్రయాణిస్తూ ఉంటారు. దీని లో భాగంగా మంగళవారం సాయంత్రం ఈ బస్సులో విద్యార్థులు ఫుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రయాణిస్తున్న చిత్రం సాక్షి కెమెరాకు చిక్కింది.

భవిత సేవల పరిశీలన

పెద్దాపురం: భవిత సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వీఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యా శాఖ ద్వారా విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థికి అందిస్తున్న ఫిజియో థెరపీని, రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆనందరావు, పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కరప మండల గ్రామ సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు

ఎం.అనుపమ, ఎంపీడీఓ 9346790319,
పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ 9908778808

గ్రామం	సర్పంచ్		కార్యదర్శి	
అరట్లకట్ట	గోపి సత్యవేణి	7993605566	వై.రామ్‌జీ	7416299365
జి.భావారం	రొక్కాల గనిరాజు	9502319888	కె.సంతోష్ మహదేవశర్మ	9666731272
గొడ్డటిపాలెం	గోన అనూష	8247395677	పి.త్రిమూర్తులు	9912985999
గొర్రిపూడి	కానూరి రమాదేవి	6301293869	కేఎస్ఎస్ సుధారాణి	9441031469
			ఎస్.వీరబాబు	9959327477
కరప	సాదే ఆశాజ్యోతి	9532066467	యు.నిర్మలాదేవి	9705687699
కొరిపల్లి	పలివెల నాగేశ్వరరావు	9666375249	ఆర్.సుబ్బలక్ష్మి	9640833799
కూరాడ	రావుల సూర్యచంద్రావతి	9014124070	ఎం.దుర్గాప్రసాద్	9494894376
నడకుదురు	డేగల లలితకుమారి	9666566235	వి.గోపాలకృష	9491369021
			కె.వరిజ	9676476445
పాతర్లగడ్డ	నాగిరెడ్డి ఏసుబాబు	9948445419	పి.సుధాకర్	8309460718
పెదకొత్తూరు	చింతా నాగలక్ష్మి	9848295290	పి.సునీల్	9705804540
పెద్దాపురప్పాడు	బిరుదా సరస్వతి	7993903954	ఎం.వీరభద్రరావు	9248356675
సిరిపురం	నున్న సుజాత	9989417657	డి.దుర్గాభవాని	9491729558
వాకాడ	అడబాల సత్య	9951975888	పి.సునీల్	9705804540
వలసపాకల	వాసంశెట్టి రామారావు	9553395145	ఎం.విజయలక్ష్మి	9912495319
వేళంగి	సవిలే నీలిమ	8790503563	పి.వీరభద్రరావు	7702400927
విజయరాయుడుపాలెం	వి.సీతారామరాఘవ	9182824192	ఎస్.వీరబాబు	9959327477
యండమూరు	మారెళ్ల శ్రీనివాసరావు	8688433626	పిఎస్‌వీఆర్ బహ్మానందం	9912697957
జెడ్.భావారం	కొత్త నాగలక్ష్మి	9014074678	వి.శ్రీదేవి	9490710952
పెనుగుదురు	రెడ్డిపల్లి వెంకటమాధవి	8498033555	బి.చంద్రకళ	7036554234
గురజనాపల్లి	అనుసూరి శ్రీనివాసరావు	9640273737	ఎంపీఎస్ఎస్ఎన్ సురేష్	9949859045
కొంగోడు	నక్కా అప్పలస్వామి	9494106999	పి.వీరభద్రరావు	7702400927